

నేడు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాక

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర సెర్ప్, ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి సోమవారం జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ టి ఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి సోమవారం ఉదయం విశాఖపట్నం నుంచి విమానంలో బయలుదేరి 9:30 గంటలకు బెంగళూరు విమానాశ్రయం చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన 12:30 గంటలకు చిలమత్తూరు మండలంలోని టేకులోడులో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అనంతరం విశ్రాంతి తరువాత మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో ఎంఎస్ఎంఇ, సెర్ప్‌పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొంటారన్నారు. సంబంధిత అధికారులు అందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సామాజిక స్థితిగతుల మార్పునకు కులగణన అవసరం

మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ ఓఎస్డీ ఎస్ఎన్. సాహు

ముగిసిన మానవహక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు



పుస్తకాన్ని విడుదల చేస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు జరగాలంటే కులగణన అవశ్యమని మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ ఓఎస్డీగా పనిచేసిన ఎస్ఎన్.సాహు పేర్కొన్నారు. అనంతపురం నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. అనంతపురం నగరంలోని యాపిల్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ మహాసభలో రెండో రోజు మూడు అంశాలపై సదస్సు జరిగింది. అంతకు ముందు నంబూద్రీపాద్ రాసిన పుస్తకాన్ని విడుదల చేశారు. అనంతరం 'కుల గణన ఎందుకు అవసరం' అన్న అంశంపై సాహు ప్రసంగించారు. దేశంలో ఇప్పటికీ వివక్ష పూరిత సమాజం ఉందని చెప్పారు.మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ వంటి వారు కూడా ఈ వివక్షను ఎదుర్కొన్న వారేనని అన్నారు. ఈ కులవివక్ష రూపాలను సరిగా అర్థం చేసుకోవాలంటే కులగణన జరగాల్సిన అవసరముందని ఆయన నొక్కిచెప్పారు. దేశంలో పశు గణన కూడా నడుస్తోందికాని, కులగణన మాత్రం జరగడం లేదని అన్నారు. మొట్టమొదటిసారి కేరళలో ముఖ్యమంత్రిగా నంబూద్రీపాద్ బాధ్యతలు చేపట్టాక అక్కడ చేయించారని గుర్తు చేశారు. వివక్ష అన్నది ఒక్క హిందూమతంలోనే కాదని, ఇతర మతాల్లోనూ వివక్ష ఉందన్నది ఆ సర్వేలో స్పష్టమైందన్నారు. అంబేద్కర్ వ్యాఖ్యానిచ్చినట్టు దేశంలోనున్న నిచ్చెన్నమెట్ల వ్యవస్థలో ఎంతపైకిపోయే కొద్ది అంత వివక్ష తగ్గుతుందని, ఎంత దిగువకొచ్చేసరికి అంత పెరుగుతుందని స్పష్టం చేశారు. కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన' అంశంపై స్వతంత్ర జర్నలిస్టు మాలిని సుబ్రమణ్యం మాట్లాడారు. బస్తరులో మానవ హక్కుల ఉల్లంఘన యధేచ్ఛగా సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు అక్కడి అడవుల్లోనున్న విలువైన ఖనిజాన్ని కట్టబెట్టేందుకు ఆదివాసాలను వెళ్లగొట్టే ప్రయత్నం పథకం ప్రకారం నడుస్తోందని అన్నారు. ఈ క్రమంలో తీవ్రవాద ముద్ర వేసి అమాయక ఆదివాసీలపై భద్రతా బలగాల ద్వారా హింసకు పాల్పడుతున్నారని తెలిపారు. మందుపాతర పెట్టారన్న నేపథ్యంలో ఒక గ్రామంలో 127 మంది ఆదివాస అమాయకులను ఎన్ఐఎ అరెస్టు చేసి ఐదేళ్లు జైళ్లో పెట్టిందని చెప్పారు. ఆ తరువాత వారంతా నిర్దోషులుగా బయటపడ్డారన్నారు. అయితే అప్పటిలోపు ఆ కుటుంబాలు చిన్నాభిన్నమైపోయాయని విచారం వ్యక్తం చేశారు. గత నెల నవంబరులో 47 మంది అమాయ గిరిజన మహిళలను ఎటువంటి కారణం లేకుండా వారం రోజులపాటు భద్రతా బలగాలు నిర్బంధంలో ఉంచాయని చెప్పారు. ఇక్కడి విషయాలు బయటకు పొక్కకుండా మీడియాను నియంత్రించే ప్రయత్నాలు సాగుతున్నాయని వివరించారు. నూతన విద్యా విధానంపై రచయిత కొప్పర్తి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం ప్రయివేటీకరణను ప్రోత్సహించేదిగా ఉందని చెప్పారు. అదే విధంగా పాఠ్యాంశాలను మార్చి కాషాయికరణ చేసే చర్యలు అందులో ఉన్నాయన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మానవహక్కుల వేదిక ఎపి రాష్ట్ర అధ్యక్షుడిగా కెవి.జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శిగా వై.రాజేష్, ఉపాధ్యక్షులుగా యుజి.శ్రీనివాసులు, ఎ.రవి, జి.శివనాగేశ్వరరావు, ఎస్.అబ్దుల్ రసూల్, ఎం.శరత్, కార్యదర్శులుగా యుఎం.దేవేంద్రబాబు, బిఎన్.సుబ్బన్న, జి.రోహిత్‌ను ఎన్నుకున్నారు. అలాగే తెలంగాణ కమిటీ అధ్యక్షులుగా భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తిరుపతి, రెండు రాష్ట్రాల సమన్వయకర్తలుగా ఎస్.జీవన్‌కుమార్, వసంతలక్ష్మి, ఎ.చంద్రశేఖర్, విఎస్.కృష్ణను ఎన్నుకున్నారు.



క్రీడాకారులతో ఎస్పీ, తదితరులు

క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

ఎస్పీ వి. రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని జిల్లా ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. మూడు రోజులుగా జిల్లా పోలీస్ క్రీడాకారుల మధ్య స్పోర్ట్స్ అండ్ గేమ్ మీట్‌లో భాగంగా క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఆదివారం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలోని వై జంక్షన్ వద్ద గల మైదానంలో హిందూపురం సబ్ డివిజన్ పోలీస్ జట్టు , జిల్లా డిఎఆర్ ఎఆర్ జట్లు ఫైనల్ పోటీల్లో తలపడ్డాయి. ఈ పోటీలో డిఎఆర్ ఎర్ జట్టు విజయం సాధించింది. ఈ ఫైనల్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ వి.రత్న ఇరు జట్ల క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరదృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. పోలీసుల నిత్య జీవితంలో క్రీడలు కూడా ఒక భాగం అన్నారు. ఈసందర్భంగా ఎస్పీ బ్యాట్ పట్టి క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు.ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, హిందూపురం డీఎస్పీ కెవి మహేష్ , ఆర్ఐలు వలి, మహేష్, ఆర్ ఎస్ఐలు వీరన్న ,వెంకటేశ్వర్లు, ప్రదీప్ సింగ్ , పీఈటీలు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, ఏఆర్ పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి వాసికి జాతీయ సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - కదిరి టౌన్



అవార్డు గ్రహీత నాగేష్

కదిరికి చెందిన సామాజిక వేత్త, కదిరి ప్రజాశక్తి అర్బన్ విలేకరి నాగేష్‌కు అరుదైన గుర్తింపు లభించింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ ఆల్ ద బెస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య కళాభవన్ లో జరుగుతున్న 19వ వార్షికోత్సవ సందర్భంగా సామాజికవేత్త నాగేష్‌కు జాతీయ సేవ రత్న అవార్డు అందజేసినట్లు ఆల్ ద బెస్ట్ అకాడమీ సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల కోసం అనాథ ఆశ్రమం నిర్వహణ, ఆపదలో ఉన్న ఎంతో మందికి సకాలంలో రక్త దానం చేయించి ఆపన్నహస్తం అందించడం లాంటి సేవా కార్యక్రమాలు నాగేష్ నిర్వహించారన్నారు. ఆయన చేసిన పలు సేవా కార్యక్రమాలకు గుర్తుగా ఈ అవార్డు అందుకున్నారన్నారు.

ఉసామా ఖాన్‌కు పురస్కారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు ఉసామా ఖాన్‌కు పురస్కారం లభించింది. పెనుకొండ దర్గా పీఠాధిపతి సజ్జాద్ ఏ నషీన్ తాజ్ బాబా, గిన్నిస్ రికార్డు గాయకుడు గజల్ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారిక సలహాదారులు అహ్మద్ షరీఫ్, జస్జోత్ సింగ్ .ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ చేతుల మీదుగా పెనుకొండ దర్గా ఖిద్మతె ఏ ఔలియా పురస్కారాన్ని ఉసామాఖాన్‌కు అందజేశారు. ఉసామా ఖాన్ సామాజిక సేవ తో పాటు అద్భుతమైన నాతే ఏ పాక్ "హరా గుంబద్ జో దేఖే గా జమానా భూల్ జాయేగా" ప్రవక్త మహమ్మద్ సొల్లల్లాహు అలైహి వసొల్లమ్ పై పాడి అలరించినందుకు పెనుకొండ దర్గా ఖిద్మతె ఏ ఔలియా పురస్కారం అందజేశారు. ఉసామాఖాన్ కు ఈ పురస్కారం దక్కడం పట్ల స్థానిక నాయకులు ఉదయ్ కుమార్, జేఈ.వెంకట స్వామి, సిపిఐ దాదాపీర్, ఏసీ నాగరాజు, మంచాల మారుతి, ఉమర్ ఫారూఖ్ ఖాన్ తదితరులు అభినందనలు తెలిపారు.

'పెన్నా'లో ఇసుక దొంగలు..!

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక పాలసీ మధ్యతరగతి కుటుంబాలకు అందని ద్రాక్షలా మారింది. మధ్యతరగతి కుటుంబానికి ఇల్లు నిర్మించుకోవాలంటే ట్రాక్టర్ ఇసుకకు రూ.4 నుండి 5 వేల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి వస్తుంది. కొంతమంది వ్యక్తులు మాత్రం అక్రమంగా ఉచితంగా ఇసుకను తరలిస్తున్నారు. హిందూపురం పట్టణ సమీపంలోని రూరల్ మండల పరిధికి చెందిన తూమకుంట, సంతేబిదనూరు. చౌళూరు గ్రామాల పరిసర ప్రాంతాల్లో పెన్నా నదిలో ఇసుక దొంగలు పడ్డారు. వీరు విచ్చలవిడిగా ఇసుకను తవ్వేస్తున్నారు. గత కొన్ని నెలల నుండి ఈ ప్రాంతం నుంచి వివిధ ప్రాంతాలకు యథేచ్ఛగా కొంతమంది వ్యక్తులు ఇసుకను తరలిస్తున్నారు. పగలు ట్రాక్టర్లు, రాత్రి అయితే టిప్పర్ల ద్వారా పెన్నా నదిలో ఇసుకను తరలిస్తుండడం వల్ల గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణాతో ఆయా గ్రామాలలో తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంతో పాటు రూరల్ మండలం కర్నాటక సరిహద్దులో ఉండడంతో రాత్రి సమయంలో ఇసుక దొంగలు టిప్పర్లను ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. ఇక పగలు అయితే అడ్డుఅదుపు లేకుండా పట్టణానికి తీసుకొచ్చి తెల్ల బంగారాన్ని తెగనమ్ముతున్నారు. అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను స్టేషన్ ఎదురుగా తరలిస్తున్నప్పటికి పోలీసులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఎవరు తమను పట్టించుకోరన్న ధీమాతో ఇసుక దొంగలు ఇసుక అక్రమ వ్యాపారం చేస్తు లక్షల రూపాయలు గడిస్తున్నారు. ఇక సామాన్యులు అయితే ఇసుకను కొనలేకపోతున్నారు. దీంతో వారి సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు

పెన్నా నదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగించినా అటు పోలీసు, ఇటు రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న వ్యక్తులను అడ్డగించి అడిగితే వారి దగ్గర ఏ విధమైన ప్రభుత్వ అనుమతులు ఉండవు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ ద్వారా ఇసుకను తీసుకువెళ్లాలి. అయితే అవేమీ లెక్క చేయకుండా కొంతమంది వ్యక్తులు ఇసుకను రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్టేషన్ ముందు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తూ ఉన్న పోలీసు అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.


ఇష్టారాజ్యంగా తరలిస్తున్నా పట్టించుకోని వైనం



పట్టణంలోని వన్ టౌన్ స్టేషన్ ఎదురుగానే ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

ఆలయ నిర్మాణానికి రూ. 2.1 లక్షల విరాళం

ప్రజాశక్తి-హిందూపురం



చెక్కును అందిస్తున్న వైద్యులు శ్రీవాణి ప్రసాద్

హిందూపురం పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద నూతనంగా నిర్మించనున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీ వాణి ప్రసాద్ ఆదివారం రూ.2, 01,116 విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు ఈ నగదును ఆలయ కమిటీ ప్రతినిధులు జేఈ వెంకటస్వామి, రాఘవేంద్ర తదితరులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన డాక్టర్ శ్రీవాణి ప్రసాద్‌లకు ఫౌండర్ కమిటీ శాశ్వత సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులు నిబద్ధతతో వ్యవహరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

పాత్రికేయులు నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరించాలని ఏపీయూడబ్ల్యూజే శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు పుల్లయ్య పేర్కొన్నారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు మల్లికార్జున ప్రసాద్ సంతాప సభ ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రతినిధులతో పాటు వివిధ వర్గాలు మల్లికార్జున ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జున ప్రసాద్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రెస్ క్లబ్ తరపున కృషి చేస్తామని ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, ప్రశాంత్ కుమార్ తెలిపారు. సీనియర్ న్యాయవాది సుదర్శన్ మల్లికార్జున ప్రసాద్ కుటుంబాన్ని ఆదుకునేందుకు తన వంతుగా రూ. 5 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూయుజె ప్రతినిధులు బాబు, ఉద్దండం చంద్రశేఖర్, కదిరి ప్రసాద్, పాత్రికేయులు రాంప్రసాద్, సుధాకర్, ప్రకాష్, శివ కుమార్, రంగనాథ్, అంజన మూర్తి, అల్లిపీరా, నాగేంద్ర, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాసు జయంతి వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

భక్త కనకదాసు జయంతి వేడుకలు హిందూపురం రూరల్ మండలం తూముకుంటలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, మహేష్ గౌడ్, తూమకుంట దేవరాజు, చంద్ర, టౌన్ ప్రెసిడెంట్ నింకంపల్లి మన్సూర్ ఖాన్, భాను, ఫరూక్, అయూబ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ'తో మెరుగైన వైద్యం

'డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ' జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎం. శ్రీదేవి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఈ కార్డు ఉన్న కుటుంబంలో అనారోగ్యానికి గురైన వారు మెరుగైన వైద్య సేవలు పొందవచ్చని ఆరోగ్యశ్రీ పథకం శ్రీసత్యసాయి జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎం. శ్రీదేవి పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు అనారోగ్యానికి గురైతే కార్పొరేట్ల ఆస్పత్రులలో లక్షల రూపాయల ఖరీదు చేసే వైద్యం పొందాలంటే కష్టం అవుతుంది. చాలామంది తమకున్న ఆస్తులను సైతం అమ్మి ఖర్చు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. లక్షలాదిరూపాయలు ఖర్చుపెట్టిన మనిషి కోలుకొని ఆరోగ్యంతో తిరిగి ఇంటికి వచ్చేవరకు నమ్మకాలు ఉండవు. పూర్వం తరం వాళ్ల పౌష్టిక ఆహారం తీసుకోవడం శారీరక శ్రమ చేయడం వల్ల అప్పట్లో రోగాలు దరిచేరేవి కావు. రాగి, సజ్జ, జొన్న, గోధుమ వంటి వాటితో పాటు పొలాల్లోనే దొరికే ఆకుకూరలు లాంటి పౌష్టిక ఆహారం తీసుకోవడంతో వల్ల ఆతరం వారు ఆరోగ్యంగా ఉండేవారు. అయితే మారిన కాల పరిస్థితుల వల్ల కలుషితమైన నీరు, గాలి, ప్రతీది కల్తీ వల్ల ఆహార అలవాట్లు మారిపోయాయి. ప్రతి మనిషికి ఆరోగ్యం ఎంతో అవసరం. ప్రతి రోగానికి అనేక రకాల పరీక్షలు చేయడం, సర్జరీలు, ఆపరేషన్లు తదితర వాటికి ఆ ఆసుపత్రి బిల్లు లక్షల రూపాయల్లో అవుతోంది. అంత మొత్తం భరించలేని పేద మధ్య తరగతి వారు నలిగిపోతుంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకం ప్రవేశ పెట్టడం వల్ల కాస్త ఉపశమనం కలుగుతోంది. ఈ పథకం ఏ విధంగా వినియోగించుకోవచ్చు ఎలా సహాయం పొందవచ్చు అన్న వివరాలు ఆరోగ్యశ్రీ పథకం జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎం. శ్రీదేవి ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న : ఆరోగ్యశ్రీ బాధితులు ఎవరికి దరఖాస్తులు చేసుకోవాలి.? ఈ స్కీము కు ఎవరు అర్హులు?



జవాబు : గతంలో ఈ పథకానికి డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ అని పేరు ఉండేది. ప్రస్తుతం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవగా మార్చబడింది. ఈ పథకంలో చికిత్సలు పొందడానికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ హెల్త్ కార్డ్ పేరు ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులే. ఇందుకోసం తమ హెల్త్ కార్డును తీసుకుని వచ్చి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ కౌంటర్లలో ఉన్న వైద్య మిత్రలతో సంప్రదించి హెల్త్ కార్డును రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా పథకంలో ఉన్న ప్రయోజనాలను పొందవచ్చు. గతంలో ఉన్న డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు కూడా ఈ పథకం కిందికి వస్తుంది కాబట్టి దానిని ఉపయోగించుకోవచ్చు.

ప్ర : ఆరోగ్యశ్రీకి దరఖాస్తు చేసుకునే విధానం నిబంధనలు ఏమిటి.? ఎంత మొత్తం వరకు వినియోగించుకోవచ్చు.?

జ : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకం ప్రయోజనాలను పొందవచ్చు. ప్రభుత్వం జారీ చేసిన ఆధార్ కార్డులో రోగి పేరు ఉండాలి. ఆ పేరు హెల్త్ కార్డు లో కూడా సరిపోయే విధంగా ఉండాలని నిబంధన ఉంది. ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రతి కుటుంబం 25 లక్షల వరకు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు.

ప్ర : ఏయే ఆసుపత్రులలో అనుమతి ఉంటుంది.?

జ : సత్య సాయి జిల్లాలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ గుర్తింపు పొందినవి 51 ఆసుపత్రులు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలు 11 ఉన్నాయి. మిగిలిన ప్రైవేట్ ఆస్పత్రులు. వీటిలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా చికిత్సలు తీసుకోవడానికి అనుమతి ఉంది. ఇందులో జిల్లా ఆస్పత్రులు 3, ఏరియా ఆసుపత్రులు 7, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 40, ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో చికిత్స పొందడానికి అవకాశం ఉంది.

ప్ర : ఏయే బిల్లులు సమర్పించవలసి ఉంటుంది.? ఎంతవరకు బిల్లులో పరిమితి ఉంటుంది.?

జ : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో హెల్త్ కార్డు ద్వారా చికిత్సలు చేసుకునే రోగులు ఎటువంటి బిల్లులు సమర్పించవలసిన అవసరం లేదు. ఆయా ఆసుపత్రులలో ఆరోగ్య మిత్రలే ప్రభుత్వానికి తగిన నివేదికను పంపుతారు. తద్వారా ఆరోగ్య బీమా పొందవచ్చు. కానీ ప్రభుత్వ ఉద్యోగులు అయితే ఇతర రాష్ట్రాలలో చికిత్స చేయించుకున్న బిల్లులను ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ద్వారా రియంబర్స్‌మెంట్ కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం ఆసుపత్రులలో వారు ఖర్చుపెట్టిన బిల్లులను, సర్జరీ చేయించుకున్నప్పటి నుండి డిశ్చార్జ్ వరకు బిల్లులను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌లో బిల్లుకు పరిమితి ఏమీ లేదు. అలాగే పేద మధ్యతరగతి కి చెందిన ఆరోగ్యశ్రీ పథకం కార్డు ఉన్నవారు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఏ ఆసుపత్రి, అలాగే గుర్తింపు పొందిన ఏ ప్రయివేటు ఆసుపత్రి అయినా చికిత్స పొందవచ్చు.

ప్ర : ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు.? ఎంత మొత్తం ప్రభుత్వం నుంచి మంజూరు అయింది.?

జ: ఈ ఏడాది సుమారుగా ఇప్పటివరకు 11,686 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బీమా అందించడం జరిగింది. ఇందుకు రూ. 20.43 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.



ఆరోగ్యశ్రీ పథకం శ్రీసత్యసాయి జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎం. శ్రీదేవి

ప్ర : జిల్లాలో మీ కార్యాలయం ఉందా.? సిబ్బంది కొరత ఉందా.?

జ : ప్రస్తుతం జిల్లా కేంద్రం అయిన పుట్టపర్తిలో కార్యాలయం లేదు. జిల్లాలోని హిందూపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో కార్యాలయం ఉంది. మా చిరునామా డాక్టర్ ఎం. శ్రీదేవి జిల్లా సమన్వయ అధికారి వారి కార్యాలయం కొత్త ఎం సి హెచ్ బిల్డింగ్ జిల్లా ఆసుపత్రి హిందూపురం. సెల్ నెంబర్ 9281068500. మరిన్ని వివరాలకు ఫోన్ చేసి సంప్రదించవచ్చు అన్నారు. జిల్లాలో 12 మంది వైద్య మిత్రల సిబ్బంది కొరత ఉంది. వీటిపై ప్రభుత్వానికి నివేదికలు పంపాము. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

ప్రజాశక్తి
www.prajasakti.com

రైతు సంక్షేమం కోసం పాటుపడాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సాగునీటి సంఘాల పాలకవర్గాలు రైతు సంక్షేమం కోసం పాటు పడాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం లో ఏకగ్రీవమైన 15 సాగునీటి సంఘాల పాలకవర్గం సభ్యులతో పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఏకగ్రీవమైన 15 సాగునీటి సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు డైరెక్టర్లకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ బాటలో సాగునీటి సంఘ పాలకవర్గాలు రైతుల సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, మండలాల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు : క్రీడలతో మానసిక ఉల్లాసం తో పాటు శారీరక దృఢత్వం పెంపొందు తుందని ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జరుగుతున్న 5వ జూనియర్ రాష్ట్ర స్థాయి జంప్ రోప్ క్రీడా పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 450 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. వారు



విద్యార్థులతో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. జంప్ రోప్ క్రీడా పోటీలను తిలకించారు. ఆదివారం జరిగిన పోటీల్లో గ్రూపు విభాగంలో పుట్టపర్తి, నంద్యాల, తిరుపతి జిల్లాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. సింగిల్ విభాగంలో నాగేష్(నంద్యాల), ప్రసన్న(కడప)లకు బహుమతులు అందజేశారు. ఈ క్రీడల్లో 72 మంది జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. వారు ఎపి తరఫున రాజస్థాన్‌లో జరిగ పోటీల్లో పాల్గొంటారని క్రీడా అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ, సెక్రటరీ సుబ్బయ్య, నవీన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్, కార్యదర్శి నరసింహనాయక్, హనీఫ్ తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫకృద్దీన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు ఓబుల్‌రెడ్డి, డాక్టర్ జాకీర్ అహ్మద్, అంజనప్ప, బయన్న, షబ్బీర్, చాంద్‌బాషా, నిజాం, కిష్టప్ప, శ్రీనివాసులు, జోలి బాబా పాల్గొన్నారు.

ప్రతి చెరువుకూ నీరు తీసుకొస్తాం

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-బత్తలపల్లి

నియోజకవర్గంలోని ప్రతి చెరువుకూ నీరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొం దిన నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు ఆదివారం అనంతపురంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీరామ్ మాట్లాడుతూ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష్యులు, టిసి మెంబర్లు బాధ్యతగా పని చేయాలన్నారు. అన్ని చెరువుల కింద ఆయకట్టును సాగులోకి తీసుకురావాలన్నారు. ఇంకా నీరందని చెరువులకు రెండు మూడేళ్లలో శాశ్వతంగా నీరు వచ్చే మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అప్రాచెరువు సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ, ఉపాధ్య క్షుడు ముసుగు నారప్ప, దంపెట్ల అధ్యక్షుడు ఉపేంద్రనాయుడు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌లను పరిటాల శ్రీరామ్ అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటప్ప, నరసింహులు, ఎల్లప్ప, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, నారాయణప్ప, శంకరనారాయణ, సావిత్రమ్మ, టిడిపి నాయకులు సురేంద్రనాయుడు, గురుప్రసాద్, సూర్యనారాయణ, పురుషోత్తంనాయుడు, విశ్వనాథ్, రామకృష్ణ, నాగప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.



పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న సాగునీటి సంఘాల అధ్యక్షులు

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ధర్మవరం టౌన్ : నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన వైసిపి నాయకులు టిడిపి లో చేరారు. రూరల్ మండలంలోని చింతలపల్లి పంచాయతీకి చెందిన 60 కుటుంబాలు, పట్టణంలోని 32వ వార్డుకు చెందిన 50 కుటుంబాలు అనంతపురంలోని పరిటాల శ్రీరామ్ క్యాంప్ కార్యాలయంలో టిడిపి లో చేరగా శ్రీరామ్ వారికి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

చర్చికి మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని దేవలంతండాలో ఉన్న విశ్వవాణి చర్చికి ఆదివారం పారిశ్రామికవేత్త ఎంజి.రెడ్డి రూ. 35 వేల విలువైన మైక్ సెట్‌ను అందజేశారు. చర్చి ఫాదర్ కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ బాల్య మిత్రుడు పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన విజయకుమార్‌రాజు జ్ఞాపకార్థం ఎంజి రెడ్డి రూ. ఈ మైక్ సెట్‌ను అందజేశారన్నారు. ఎంజి రెడ్డి ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సమరసింహారెడ్డి, వినోద్‌కుమార్, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని మండల సంఘం అధ్యక్షుడు మద్దేపల్లి రవి కోరారు. ఎన్‌పి కుంటలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన రజక సామాజిక వర్గం ప్రజలకు వృద్ధాప్య పింఛన్లు, ఇల్లు లేని వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రజకుల సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఇకనైనా ప్రభుత్వం స్పందించి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లయ్య, రవిచంద్ర, గంగన్న, నారాయణ, వీరనారాయణ, శ్రీనివాసులు, వెంకటరమణ, రమణ, నరసింహులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు, కర్నాటక నాగేపల్లి సిటీ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, కుటుంబ సభ్యులు, డాక్టర్ లలిత, ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నృత్యంలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని వాల్మీకి హై స్కూల్‌లో ఆదివారం ఎపి డ్యాన్స్ స్పోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సెలక్షన్స్ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 200 మందికి పైగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎపి డ్యాన్స్ స్పోర్ట్ అసోసియేషన్ నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ మురళీకృష్ణ, పర్యవేక్షకుడిగా కర్నూలుకు చెందిన శ్రీనివాసులు హాజరయ్యారు. కూచిపూడి నృత్యం న్యాయ నిర్ణేతగా రాజశేఖర్, వెస్ట్రన్ డ్యాన్స్ న్యాయ నిర్ణేతలుగా మోహన్, తిరుపాల్, సురేష్ మాస్టర్లు వ్యవహరించారు. ఎంపికైన అభ్యర్థులు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు శ్రీసత్యసాయి డ్యాన్స్ స్పోర్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ మనోహర్ తెలిపారు. వారు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, వాల్మీకి విద్యాసంస్థల అధినేతలు పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

రేపు నాయీబ్రాహ్మణుల ర్యాలీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఇతరులు క్షౌర వృత్తిలోకి చొరబడి తరతరాలుగా కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న తమ పొట్ట కొట్టొద్దని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. పట్టణంలో ఈ నెల 17వ తేదీ చేపట్టే ర్యాలీ లో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం ర్యాలీకి అనుమతి కోరుతూ పట్టణ సిఐ నారాయణ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. అంతకుముందు పట్టణంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా ప్రాంగణంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కులస్తులు సమావేశమయ్యారు. నాయకులు మాట్లాడూతూ పట్టణంలో 130 బార్బర్ షాపులు ఉండగా తమను రోడ్డున పడేసేందుకు ఇతరులు కార్పొరేట్ హంగు ఆర్భాటాలతో 'బార్బర్ సెలూన్' పేరుతో ఈ వృత్తిలోకి ప్రవేశించాలని చూస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మంగలి మహాసభ హరిప్రసాద్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి మునికుమార్, ఉపాధ్యక్షుడు ఇండ్లూరి కృష్ణ, సాధికార కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు, అనిమల ప్రసాద్, శ్రీనివాసులు, రమణ, కెబి.లోకేష్, ఎస్‌వి బ్రదర్ శ్రీనివాసులు, కెబి.శివ, యాపిల్ కట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవపురంలో సామూహిక వివాహాలు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండలంలోని ఇండ్ల వెంకటంపల్లి(చెన్నకేశవపురం) శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఉచిత సామూహిక వివాహాలు చేశారు. సత్యసాయి భక్తుల సహకారంతో ధర్మశాల వ్యవస్థాపకుడు చల్లా సాయికృష్ణ ఆధ్వర్యంలో 24 జంటలు ఒక్కటయ్యాయి. వధూవరుల కుటుంబ సభ్యులు, బంధువులు, సత్యసాయి భక్తులతో గ్రామం కిటకిటలాడింది. వివాహాలకు ముఖ్యఅతిథిగా శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్రతి జంటకు బంగారు తాళిబొట్టు, కాలి మెట్టెలు, వధూవరులకు నూతన వస్త్రాలు, వంట సామగ్రి అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నారెడ్డి, ఉషారాణి, టిడిపి నాయకులు రామ్, లక్ష్మణ్, లక్ష్మీనారా యణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు:ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్లు, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హామీ ఇచ్చారు. రొళ్ల మండలంలోని దొడ్డేరి గ్రామంలో ఆదివారం వంద వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు వారికి గ్రామ శివారులో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ దొడ్డేరి గ్రామ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు. నియోజకవర్గంగా పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తామన్నారు. అనం తరం ఇంజినీర్లతో కలిసి రత్నగిరి డ్యాంను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపించామ న్నారు. త్వరలో రంగనపల్లి గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ చేసి పనులను ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలో 47 చెరువు లకు సాగు నీటి సంఘాల అధ్యక్షులుగా టిడిపి మద్దతుదారులు ఎన్నిక కావడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, నాయకులు గురుమూర్తి, కిష్టప్ప, భరత్, లక్ష్మీపతి, ఉమేష్, నరసప్ప పాల్గొన్నారు.



సాగునీటి సంఘాల అధ్యక్షులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజు

సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

నియోజకవర్గంలోని సాగు నీటి సంఘాల నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లతో పట్టణంలోని యాదవ్ కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా టిడిపి జెండా ఎగిరేలా నాయ కులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. అనంతరం సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, టిసి మెంబర్లను ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండలాల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప, గణేష్, కుమారస్వామి, దాసిరెడ్డి, నాయకులు పాండురంగప్ప, రాధాకృష్ణ, జడ్పిటిసి ఉమేష్, మంజునాథ్ పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

విద్యుత్ ఛార్జీల రూపంలో ప్రజలపై భారం మోపడం దారుణమని సిపిఎం నాయకులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో పట్టణం లోని కళాజ్యోతి కూడలిలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, పట్టణ కార్యదర్శి ఎ.మారుతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చిన సిఎం చంద్రబాబు ఇప్పుడు ప్రజలపై పెనుభారం మోపడం దారుణమన్నారు. పాదయాత్రలో నారా లోకేష్ సైతం కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచమని, స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, లేనిచో ఆందోళనలు మరిం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్.బాషా, సిఐటియు మండల నాయకులు జెవి.రమణ, ఎల్.ఆదినారాయణ, చేనేత కార్మిక సంఘం నాయకులు హరి, వెంకటస్వామి, రవి, చిన్నరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ భారాలపై ఆందోళన చేపట్టిన సిపిఎం నాయకులు

షాకీర్‌కి నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్, అనంత సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో పెనుకొండ దర్గా జాతీయ సమైక్యత పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా పుట్టపర్తి షామీర్‌కు నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డు దక్కింది. పెనుకొండలోని బాబయ్య దర్గా ఉరుసు సందర్భంగా ఆదివారం ఆలిండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫరూక్ ఖాన్, అనంత సాహిత్య అకాడమీ అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, ఆలిండియా సంయుక్త ఆధ్వర్యంలో పీఠాధిపతి తాజ్‌బాబా అధ్యక్షతన నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డు పురస్కారాల కార్యక్రమం నిర్వహిం చారు. అందులో పీఠాధిపతి నుంచి ఖిద్మత్ ఎ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు జిఎండి షాకీర్ జాతీయ సమైక్యతా పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో ఖిద్మత్ ఎ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ షామీర్, అలీ, చాంద్, నయాజ్ పాల్గొన్నారు. ఛారిటబుల్ ట్రస్టు ద్వారా చేసిన సేవలకు గుర్తింపుగా ఇది లభించిందని వారు తెలిపారు. అవార్డు లభించడంతో తమకు ఇంకా బాధ్యత పెరిగిందని వారు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సంస్థ అధ్యక్షులు షామీర్

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని జిల్లేడుగుంట ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే రాజు, ఆయన సతీమణి ఉమాదేవి, మాజీ ఎమ్మె ల్సీ గుండుమల తిప్పేస్వామి, దేవాదాయ శాఖ అధికారులు స్వామి రథాన్ని లాగారు. అంతకుముందు ఆలయ అర్చకులు, మహిళలు హారతులు ఇచ్చి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో రథం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోలాహలం మధ్య రథాన్ని ఆలయం నుంచి తూర్పు వైపు లాగారు. రథోత్సవం సమయంలో స్వామి నామస్మరణతో గ్రామం మార్మోగింది. అర్బన్ సిఐ రాగిరి రామయ్య, రూరల్ సిఐ రాజకుమార్, పోలీ సుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ నరసగౌడ్, ఈఓ నరసింహారాజు, సర్పంచి రామాంజనేయులు, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ మెంబర్లు వీణ, నాగసుధ, రత్నమ్మ, రంగమ్మ, నాయక్, జయరామ్‌స్వామి, పాల్గొన్నారు .



రథం లాగుతున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల, తదితరులు

సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

సాగునీటి సంఘాలకు ఎన్నికైన నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయ ఆవరణలో ఘనంగా సన్మానించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి మనోహర్ మాట్లాడుతూ సాగునీటి సంఘాల నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు సభ్యులను సమన్వయం చేసుకుని భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకొని ప్రభుత్వ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నారాయణస్వామి, చికెన్ తిరుపాల్, రంగయ్య, అశోక్, ఆనంద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను అరికడదాం : ఎస్ఐ

ప్రజాశక్తి-పరిగి

యువత డ్రగ్స్, అసాంఘిక కార్యక్రమాల వల్ల కలిగే నష్టాలను గుర్తించి, వాటికి దూరంగా ఉండాలని ఎస్ఐ రంగడుయాదవ్ సూచించారు. భగత్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యం లో ఆదివారం డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో డ్రగ్స్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కార్తీక్, హరి, సంతోష్, నాగేష్, పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పట్టణ క్రీడాకారులు బి.నవ్య, ఎన్.ఉష ఎంపికైనట్లు ఆర్‌డిటి కబడ్డీ కోచ్ పృధ్వీ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు స్థానిక ఆర్‌డిటి క్రీడా మైదానంలో శిక్షణ పొందారన్నారు. గుంతకల్లు రైల్వే క్రీడా మైదానంలో జరిగిన జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొని వీరు ఉమ్మడి అనంతపురం జిల్లా తరఫున పాల్గొని సత్తా చాటారన్నారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నాగులకట్ట ప్రతిష్టాపన

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని శంకరగల్లు గ్రామంలో ఆదివారం దళిత నాయకులు నాగులకట్ట ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, మంగళహారతి, కుంభాభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్ర, వైసిపి ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప, ఎంపీటీసీ పుష్పలత నాగేంద్ర, బాదిపల్లెప్ప, నాగప్ప, హనుమంతరాయప్ప, న్యాయవాది లక్ష్మీనారాయణప్ప, విగ్రహ దాత రాజబాబు, లక్ష్మీనర్సప్ప, చిత్తయ్య, పాల్గొన్నారు.

కార్మికులు సమిష్టిగా పోరాడాలి

ప్రజాశక్తి-లేపాక్షి

కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేసి న్యాయమైన డిమాండ్లను సాధించుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు జడ్డీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక నంది విగ్రహం ఆవరణలో ఆదివారం రాధమ్మ అధ్యక్షతన సిఐటియు మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా రాజప్ప, సభ్యులుగా ఆశా కార్యకర్తల నుంచి రాధమ్మ, పద్మ, పార్వతమ్మ, నాగరత్నమ్మ, నరసమ్మ, శాంతమ్మ, గంగా, అంజనమ్మ, కౌసర్, పార్వతి, అంగన్వాడీల నుంచి భాగ్యమ్మ, శశికళ, శ్రీదేవి, మమత, రూపా, ధనమ్మ, మాధవి, జయసుధ, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి గోవిందప్ప, గోపాల్, మల్లికార్జున, సంఘం నుంచి గోవిందరెడ్డి, మరో ఇద్దరిని ఎన్నుకున్నట్లు శ్రీనివాసులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

హాస్టల్ విద్యార్థులకు త్రిపుర రిసార్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా బైక్ రైడర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. గోపీనాథ్ మాట్లాడుతూ చలికాలంలో హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. భవిష్యత్తులో పేదవిద్యార్థుల చదువుల కోసం సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో భీమ్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

'అమరజీవి'కి ఘన నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన ప్రాణ త్యాగం తెలుగు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతుందని జిల్లా ఎస్పీ వి.రత్న తెలిపారు. అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల న్నారు. కార్యక్రమంలో ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్ కుమార్, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, మమత, ఆర్ఐ వలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి జీవితం భావితరాలకు ఆదర్శం : జెసి

పుట్టపర్తి అర్బన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతికి చేసిన సేవలు భావితరాలకు ఆదర్శమని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమరజీవి వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్ఓ విజయసారథి, పెనుకొండ అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారులు గంగాధర్, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : తెలుగు భాషా సంయుక్త రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణాలు త్యజించిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జూటూరు రమణయ్య పిలుపునిచ్చారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాటి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక వాసవీ సర్కిల్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూటూరు రమణయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పొట్టి శ్రీరాములు వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయం అన్నా రు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి పిన్ను అశోక్, ట్రెజరర్ తబ్జుల్ శ్రీనివాసులు, ఆలయ కమిటీ ఛైర్మన్ పిన్ను ప్రసాద్, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు పొలమడ రూపారాగిణి, ట్రెజరర్ నల్లపేట మంజు, సంయుక్త, ఆర్యవైశ్య యువజన సంఘం మీడియా కమిటీ సభ్యులు గ్రంధే శ్రీనివాసులు, బండ్లపల్లి రంగనాథ్, తలుపుల ప్రసాద్, రేపాకుల రాజశేఖర్, తబ్జుల్ లక్ష్మీనారాయణ, కార్తీక్, ముంటిమడుగు రాఘవేంద్ర, శేగుమురళి, గోపా చంద్రకాంత్, అన్నా లక్ష్మీనారాయణ, శీభా సురేష్ గుప్తా, జీఎస్టీ ప్రసాద్, నగేష్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ మహిళా మండలి, నగర సంకీర్తన, వాసవీ భజన మండలి, ఆవోపా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ వి.రత్న

ఆర్డీవో కార్యాలయంలో..

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. సిఎస్‌డిటి లక్ష్మీదేవి, డిప్యూటీ తహశీల్దార్ సునీత, రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్ హంపయ్య, జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, నరేష్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఎఎస్ఓ గోపాల్, తదితరులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కొత్తచెరువు : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అటెండర్ వెంకటరమణ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని, ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠకులు నరసింహులు, నాగేంద్ర, మస్తాన్, స్వీపర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి నారా యణ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరజీవి వర్ధంతి కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులతో పాటు అధికారులు పాల్గొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సిద్దేశ్వర పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణరావు, పాల్యం చంద్ర, నీరుగంటి నరసింహ, హనుమయ్య, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో అమరజీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎద్దుల రాముడు, ఈశ్వరయ్య, బాబు, నారాయణ, సూరి, బాదుల్లా, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : శాఖా గ్రంథాలయంలో అధికారి డి.శీనానాయక్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సాయిమనోహర్, సూపరింటెండెంట్ అబ్దుల్ నబీ, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆర్యవైశ్య సంఘం, రాజకీయ, ప్రజా సంఘాలు ఘనంగా నివాళులర్పించాయి. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపికా వేణురెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ఎ.శివ, మండల, పట్టణ కన్వీనర్లు రాము, మన్సూర్ ఖాన్, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు ఇంచార్జులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అదే విధంగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక చిన్న మార్కెట్ సర్కిల్ లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జేపీకే రాము, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు, కౌన్సిలర్ ఎన్ఆర్ రాఘవేంద్ర, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కడపకు తరలిన ముస్లిములు

ప్రజాశక్తి-హిందూపురం

2024 వక్ఫ్ బోర్డు బిల్లుకు నిరసనగా ఆదివారం కడప పట్టణంలో జమియత్- ఒలమా-ఏ- హింద్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన సమావేశానికి హిందూపురం నుండి భారీసంఖ్యలో ముస్లిం సోదరులు, యువకులు తరలివెళ్లారు. 70 బస్సులు, సుమారు 150 కార్లు, 100కు పైగా లారీలు, టెంపోల్లో సుమారు 15000 వేల మందికి పైగా వెళ్లారు. ఈ సందర్భంగా జమియత్-ఒలమా-ఏ- హింద్ ప్రతి నిధులు మాట్లాడుతూ ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని దేశంలో బిజెపి మత స్వేచ్ఛను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సర్వే కమిషనర్ స్థానంలో కలెక్టర్ ను నియమించడం, వక్ఫ్ ఆస్తుల సర్వేలు నిర్వహించే అధికారాలను ఆయనకు మంజూరు చేయడం, ఈ బిల్లు రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతర సభ్యులను అనుమతించడంతో పాటు తప్పనిసరి చేస్తుంది అన్నారు. బిజెపి మతఛాందసవాద రాజకీయాలను మానుకొని భిన్నత్వంలో ఏకత్వం. ఏకత్వంలో భిన్నత్వమని అనే భారతీయ నినాదాన్ని మరచి భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా వ్యవహరించడం పద్ధతి కాదని అన్నారు. ఈ బిల్లును ప్రతి భారతీయ ముస్లిం వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు.



కడపకు బయల్దేరిన ముస్లింలు